క్లుప్తంగా

అలరించిన శ్రీవారి కల్యాణం గానామృతం



వేంకటేశ్వరస్వామి కల్యాణ గానామృతాన్ని నిర్వహిస్తున్న భజన సంఘ సభ్యులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన శ్రీ లక్ష్మీ నారాయణ భజన సంఘం వారు నిర్వహించిన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ గానామృతం భక్తులను అలరించింది. ముందుగా వారు ఆలయ అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి పూజలు చేశారు. అనంతరం భజనలు చేస్తూ శ్రీవారి కల్యాణ గానామృతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఆ తరువాత వారంతా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఏపీఎన్‌వైఎం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా ఇస్మాయిల్



షేక్ ఇస్మాయిల్

ద్వారకాతిరుమల: మండలంలోని దేవినేనివారి గూడెంకు చెందిన షేక్ ఇస్మాయిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ బాషా(దూదేకుల) యువజన ముస్లిం సంక్షేమ సంఘం గోపాలపురం నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గుంటూరులోని వుడ్ ల్యాండ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం సంఘ జిల్లాలు, అసెంబ్లీల నూతన కమిటీల నియామకం జరిగింది. అందులో గోపాలపురం నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడిగా షేక్ ఇస్మాయిల్‌ను ప్రకటించి, నియామక పత్రాన్ని ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు పెద మస్తాన్ అందించారు. అనంతరం ఇస్మాయిల్‌ను సత్కరించి, అభినందించారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాత శ్రీనివాసరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కడలి శ్రీనివాసరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

చండీహోమం



నూకాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు) ఆధ్వర్యంలో అర్చకులు వేదోక్తంగా, శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించారు. పలువురు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, మహాసంకల్పం చేయించి అమ్మవారిని షోడశోపచారాలతో పూజించి అనంతరం చండీహోమం, మహాపూర్ణాహుతి సమర్పించినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ నులకాని మృతి తీరని లోటు

టి.నరసాపురం: ఎంపీటీసీ నులకాని నరసింహారావు మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పలువురు పార్టీ నాయకులు అన్నారు. నరసింహారావు పార్టీకి, గ్రామాభివృద్ధికి ఎంతో కృషిచేశారన్నారు. ఆయన గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందడం చాలా బాధాకరమని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, సహకార సంఘాల మాజీ చైర్మన్‌లు దేవరపల్లి ముత్తయ్య, పిన్నమనేని చక్రవర్తి తదితరులు అన్నారు. నరసింహారావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

16న కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16, బుధవారం కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెదపాటి రామకృష్ణ, గండికోట రాజేష్, కోశాధికారి కేవీ సుబ్బారావు తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, కళాకారులు హాజరుకావాలని కోరారు.

విలీన మండలాల్లో వెబ్‌ల్యాండ్ కష్టాలు

- 8 ఏళ్లు గడిచినా ఇంకా వెబ్‌ల్యాండ్‌ను తెరవని అధికారులు
- ఆన్‌లైన్‌లో మార్పులు వీలుకాక రైతుల అవస్థలు
- ప్రభుత్వ పథకాలు సైతం అందడం లేదని ఆవేదన



రెవెన్యూ సదస్సులో భూసమస్యపై అధికారులకు దరఖాస్తు అందజేస్తున్న రైతు (ఫైల్)

కుక్కునూరు: విలీన మండలాల్లో వెబ్‌ల్యాండ్‌ను ఫ్రీజ్ చేయడంతో ఆన్‌లైన్‌లో మార్పులు చేసుకోలేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలవరం భూసేకరణలో నేపథ్యంలో వెబ్‌ల్యాండ్‌ను అధికారులు 2017లో ఫ్రీజ్ చేశారు. ఫ్రీజింగ్ ప్రక్రియ చేపట్టడానికి గల కారణాలు రైతులకు పూర్తి వివరాలు తెలియనప్పటికి భూ అవకతవకల నేపథ్యంలో ఫ్రీజింగ్ ప్రక్రియను చేపట్టినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. కాగా భూపరిహారం చెల్లించి దాదాపుగా 8 ఏళ్లు అవుతున్నా ఇంకా వెబ్‌ల్యాండ్‌ను ఓపెన్ చేయకపోవడంతో ముంపు లేని రైతులు ప్రభుత్వ పథకాలు అందక నానా తంటాలు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

తూతూమంత్రంగా రెవెన్యూ సదస్సులు

ఫ్రీజింగ్ కారణంగా భూయజమాని మృతి చెందితే వారి వారసుల పేర్లు పట్టాదారుగా మార్పు చేసుకునే అవకాశం లేక రైతు భరోసా, పీఎం కిసాన్, పంట ఇన్సూరెన్స్, సబ్సిడీ మీద ప్రభుత్వం అందించే వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక రైతులు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అంతే కాక ఏదైనా ఆర్థిక అవసరం నిమిత్తం భూమి అమ్ముకునే అవకాశం లేకుండా పోయిందంటున్నారు. ఫ్రీజింగ్ కారణంగా నేటి వరకు పోలవరం పరిహారంలో భాగంగా గిరిజన రైతులకు భూమికి, భూమి కింద ఇచ్చిన భూములకు సరిహద్దులు చూపించే అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు అధికారులను వెబ్‌ల్యాండ్ లేకుండా సదస్సులు నిర్వహించి ఏం లాభం అని ప్రశ్నించినా అధికారులు తమకేమి పట్టనట్టుగా తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. వెబ్‌ల్యాండ్ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు రైతులు ఉన్నతాధికారుల దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా వెబ్‌ల్యాండ్ ప్రక్రియను ఓపెన్ చేసి రైతులకు న్యాయం చేయాలని విలీన మండలాల రైతులు కోరుతున్నారు.

భూమి అమ్ముకునే అవకాశం లేదు



మా భూములు ముంపులో లేని కారణంగా పరిహారం రాలేదు. మా ఆర్థిక అవసరాల నిమిత్తం భూమిని అమ్ముకుందామంటే వెబ్‌ల్యాండ్ ఫ్రీజింగ్ చేయడంతో భూమిలో పట్టాదారు పేరు మార్పు చేసుకునే అవకాశం లేదు. దీంతో భూమిని కొనేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు.

– వద్దే రఘుబాబు, ఇసుకపాడు, కుక్కునూరు

భూమి పంచే వీలు లేదు



నాకు ఇసుకపాడులో 4 ఎకరాల భూమి ఉంది. నాకు ఇద్దరు కుమారులు. నా భూమికి సంబంధించి పట్టాదారుగా మా నాన్న పేరు ఉంది. ఫ్రీజింగ్ కారణంగా పట్టాదారుగా నా పేరు మార్పు చేసుకునే అవకాశం లేకపోవడంతో పెళ్లైనా నా ఇద్దరు కుమారులకు భూమిని పంచే అవకాశం లేకుండా పోయింది. అంతేకాక నాకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలు అందడం లేదు.

– మచ్చా పెద్దరాజు, ఇసుకపాడు, కుక్కునూరు

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలోని ఆర్సీఎం ఆలయంలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ టోనీ, సంఘస్తులు

జంగారెడ్డిగూడెం: క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్సీఎం చర్చి విచారణ గురువు ఫాదర్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చి ఆవరణ నుంచి నిర్మల హాస్పిటల్, ఆర్టీసీ బస్టాండ్, లక్ష్మీ టాకీస్ మీదుగా బోసు బొమ్మ సెంటర్ వరకు భారీ ప్రదర్శన చేశారు. నిర్మల కాన్వెంట్ సిస్టర్స్, కథోలిక్ విశ్వాసులు మట్టలు చేతబూని దావీదు కుమారునికి జయము, హోసన్నాకు జయం అంటూ పాటలు పాడుతూ, నినాదాలు చేస్తూ జంగారెడ్డిగూడెం పట్టణ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫాదర్ కళ్యాణ్ కుమార్ నాయకత్వం వహించగా నిర్మల కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ అమలారాణి, కన్య స్త్రీలు, ఉపదేశులు, క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్కవరంలో

లక్కవరం బైబిల్ మిషన్ మహిమాలయంలో విశ్వాసులు మట్టల ఆదివారం నిర్వహించారు. పాస్టర్ మాట్లాడుతూ క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే అత్యంత ప్రముఖమైన రోజుల్లో మట్టల ఆదివారం ఒకటన్నారు. దీనిని పామ్ సండే అని కూడా అంటారని, శ్రమలకాలం(లెంట్ డేస్)లో ఈ పామ్ సండే వస్తుందన్నారు. ఈస్టర్‌కి వారం ముందు దీనిని జరుపుకుంటారని తెలిపారు. అధిక సంఖ్యలో విశ్వాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చింతలపూడి: చింతలపూడి బోయగూడెం ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవ భక్తులు, విశ్వాసులు మట్టలను చేతబూని బోయగూడెం నుంచి ఫైర్ స్టేషన్ మీదుగా పట్టణంలో సువార్త ప్రకటిస్తూ ర్యాలీ జరిపారు. ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి క్రీస్తు గొప్పదనాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్సీఎం చర్చి ఫాదర్ కామా మాధ్యూ , క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో...

కొయ్యలగూడెం: మట్టల ఆదివారం వేడుకలు ఎస్సీ కాలనీలో ఉన్న మన్న చర్చ్‌లో ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి బాబురావు ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి పురవీధుల్లో ఈత మట్టలతో ర్యాలీ నిర్వహించారు. ఈస్టర్ పురస్కరించుకొని శ్రమ దినాలలో విశ్వాసులు నియమ నిబద్ధతలను కలిగి క్రీస్తు కృపకు పాత్రులు కావాలని బాబురావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ విశ్వాసులు, చిన్నారులు, పాల్గొన్నారు.

కామవరపుకోటలో...

కామవరపుకోట: మండలంలో మట్టల ఆదివారంను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. కొత్తూరులోని రోమన్ క్యాథలిక్ మిషన్ ఆధ్వర్యంలో ఈత మట్టలు చేతపట్టి స్థానిక చెక్‌పోస్టు నుంచి చర్చి వరకు ఊరేగింపు నిర్వహించారు. ఫాదర్ గోగు పీటర్ ప్రసాద్ ప్రార్థన గీతాలు ఆలపించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్షలు ఆఖరి వారానికి చేరుకోవడంతో ఈ వారం రోజులు పాటు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ఫాదర్ పీటర్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సిస్టర్స్, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: పంగిడిగూడెం ఆర్సీఎం ఆలయం నందు, అలాగే రాళ్లకుంట విచారణలోని దొరసానిపాడులో మట్టల (మ్రాని కొమ్మల) ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. పంగిడిగూడెంలో విచారణ కర్తలు ఫాదర్ టోనీ, సంఘస్తులు కొబ్బరి మట్టలు పట్టుకొని, యేసు రాజుకు జయము హోసన్నా హోసన్నా అంటూ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జోసఫ్, సంఘ పెద్దలు పాల్గొన్నారు. అలాగే దొరసానిపాడులో రాళ్ళకుంట విచారణ కర్తలు ఫాదర్ ఇ.జీవరత్నం ఆధ్వర్యంలో నిత్య సహాయ మాత దేవాలయము నందు ఈ మ్రాని కొమ్మల ఆదివారంను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో సంఘ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



చింతలపూడి: క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవ భక్తులు



కొయ్యలగూడెం: మట్టల ఆదివారం వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహిస్తున్న దృశ్యం



కామవరపుకోట: రోమన్ క్యాథలిక్ మిషన్ ఆధ్వర్యంలో ఈత మట్టలతో విశ్వాసుల ర్యాలీ

అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి



పొంగుటూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ నాయకులు

కొయ్యలగూడెం: భారతరత్న, బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించాల్సిందిగా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు పిలుపునిచ్చారు. పొంగుటూరు గ్రామంలో సర్పంచ్ పసుపులేటి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పాల్గొని కులమతాలకు అతీతంగా అంబేడ్కర్ జయంతి నిర్వహించాలన్నారు. ఈనేపథ్యంలో కొయ్యలగూడెంలోని గర్ల్స్ హైస్కూల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి, అదేవిధంగా కొవ్వూరు రోడ్డు, మండల పరిషత్ కార్యాలయం, ఇరిగేషన్ కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాల వద్ద జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరవుతున్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ ఏలేటి చంద్రం, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ దూలపల్లి కాంతారావు, జిల్లా నాయకులు చిడిపి రవి, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా తాగునీటి ట్యాంకు నిర్మాణాలు



పరింపూడిలో తాగునీటి వాటర్ ట్యాంక్ నిర్మాణం

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలో తాగునీటి టాంకర్ల నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నామని, రెండు నెలలలోపు వీటిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి తెలిపారు. పరింపూడి ఎస్సీ, ఎస్టీ ఏరియాలో రూ.48 లక్షలతో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ట్యాంక్ నిర్మాణం పూర్తికావచ్చిందన్నారు. అదేవిధంగా పెద్ద నుయ్యి వద్ద 90 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించామన్నారు. కన్నాపురం రోడ్ సచివాలయం(4) నాలుగు వద్ద 90 వేల లీటర్లతో ట్యాంకర్ నిర్మాణం చేస్తున్నామన్నారు. వీటి నిర్మాణం పూర్తయితే తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం అవుతుందన్నారు. శ్రీరామ్ నగర్ పెద్ద వాటర్ ట్యాంక్ నిర్మించి శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని తొలగించి అదే స్థలంలో 1.50 లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

రావి ఆకుపై అంబేడ్కర్ చిత్రం



కామవరపుకోట: రావి ఆకుపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని రూపొందించింది అబ్బురపరిచింది 9వ తరగతి విద్యార్థిని షేక్ ఖయ్యూమ్. రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు బిరుదుగట్ల నాగేశ్వరరావు ఇచ్చిన శిక్షణతో విద్యార్థిని షేక్ ఖయ్యూమ్ అంబేడ్కర్ ముఖ ఆకృతిని రావి ఆకుపై చిత్రీకరించి అంబేడ్కర్‌పై తనకున్న అభిమానాన్ని చాటింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మెరిసిన విద్యా కుసుమాలు



మోదుగ అను
బైపీసీ 417 మార్కులు



తణుకు జయశ్రీ
బైపీసీ 926 మార్కులు

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన బుట్టాయగూడెం కరాటం కృష్ణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (హైస్కూల్ ప్లస్) విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇరపా గంగాదేవి తెలిపారు. హైస్కూల్ ప్లస్ కళాశాల నుంచి మొదటి సంవత్సరం పరీక్షలకు 22 మంది విద్యార్థులు హాజరుకాగా 13 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు.ద్వితీయ సంవత్సరంలో 17 మంది పరీక్షలకు హాజరుకాగా 9 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. అలాగే ఈ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం బైపీసీ గ్రూప్ విద్యార్థిని తణుకు జయశ్రీ వెయ్యి మార్కులకు గానూ 926 మార్కులు, ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యార్థిని మోదుగ అను 440 మార్కులకు గానూ 417 మార్కులు సాధించి ప్రథములుగా నిలిచారని చెప్పారు. కాగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

జాబ్‌మేళాకు 210 మంది అభ్యర్థుల హాజరు



మెట్రో కెమ్ జాబ్‌మేళాను ప్రారంభించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీరామచంద్ర జూనియర్ కళాశాలలో ఆదివారం ప్రముఖ ఫార్మాకంపెనీ మెట్రో కెమ్ నిర్వహించిన జాబ్‌మేళాకు 210 అభ్యర్థులు హాజరైనట్లు మెట్రో కెమ్ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు రెండు రోజుల్లో ప్రకటిస్తామని తెలియజేశారు. ఈ జాబ్‌మేళాను మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు, శ్రీరామచంద్ర చైర్మన్ బీవీ కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో మెట్రో కెమ్ వైజాగ్ జనరల్ మేనేజర్ దుర్గారావు, వైస్ చైర్మన్ రాంబాబు, హెచ్ఆర్ విభాగం ప్రతినిధి తేజ, పాలపర్తి శ్రీనివాస్, శ్రీరామచంద్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ వీవీఎస్ జగదీష్‌కుమార్, ఏవో రమేష్ పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో బిల్లుల ఆదా

ఏలూరు (టూటౌన్): ఇంటింటా సోలార్ యూనిట్ల ఏర్పాటుతో కరెంట్ బిల్లుల ఆదాతో పాటు, ఉత్పత్తి చేసిన అదనపు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఎస్ఈ సాల్మన్ రాజు అన్నారు. ఆదివారం స్థానికంగా టిల్ టవర్స్ సోలార్, రాజ్ ప్రీమియం సోలార్ ప్యానల్స్‌ను రూపొందించింది. దీనికి సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాల్మన్ రాజు పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ రాయితీతో పాటు బ్యాంకు రుణ సదుపాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నారా శేషు, రాజనాల రామ్మోహన్ రావు, పి.రాధాకృష్ణ, కేఎం అంబేడ్కర్, పి.అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫ్రూటీ, బటర్‌మిల్క్ ప్యాకెట్ల పంపిణీ



ఫ్రూటీ, బటర్‌మిల్క్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్ష రాసిన వెయ్యి మంది విద్యార్థులకు చింతలపూడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రూటీ, బట్టర్ ప్యాకెట్లు అందజేశారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని చిల్లపల్లి రామ్మోహన్ రావు, విజయలక్ష్మి దంపతుల ఆర్థిక సహాయంతో విద్యార్థులకు రూ.10 వేల విలువైన ఫ్రూటీ, బటర్‌మిల్క్ ప్యాకెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు గోలి చంద్రశేఖర్ రెడ్డి, గాంధీ, అల్లంరాజు పవన్ కుమార్, హైందవ సేవా సమితి సభ్యులు దుర్గాప్రసాద్, భాస్కర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా ర్యాలీ



అప్పలరాజుగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపినప్పుడే ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాలు లభ్యమవుతాయని రైతు సాధికార సంస్థ ప్రతినిధి కుంచే గంగాధరరావు అన్నారు. విద్యార్థులతో కలిసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ అప్పలరాజుగూడెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు 25 రకాలు తయారు చేసి, రైతులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు ప్రతి ఆర్‌బీకే వద్ద అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి దుర్గ అప్పారావు, వ్యవసాయ సిబ్బంది, ఐసీఆర్‌పీఎస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్ర రక్తపు గాయాలతో ఉన్న సాయి

ద్వారకాతిరుమల: స్థానిక గరుడాళ్వార్ సెంటర్‌లో శనివారం నలుగురు యువకులు గొడవ పడుతుండగా మధ్యలో అడ్డువెళ్లిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ కథనం ప్రకారం . గ్రామానికి చెందిన కళ్లెంపూడి సాయి దేవస్థానంలో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వెళుతుండగా గరుడాళ్వార్ సెంటర్‌లో గ్రామానికి చెందిన సీహెచ్ నరేష్, ధర్మ, శివ కుమార్, పి.కిరణ్ గొడవ పడుతుండాన్ని గమనించి, అక్కడ ఆగాడు. ఎందుకు గొడవపడుతున్నారని అడుగగా నీకెందుకంటూ వారు సాయిని ఇష్టానుసారం కొట్టారు. దాంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. సాయి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందగా, అక్కడి నుంచి వచ్చిన ఎమ్మెల్సీ రిపోర్టుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

16న దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠ

కొయ్యలగూడెం: అంకాలగూడెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఈనెల 18వ తేదీ ఉదయం 7.52 గంటలకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 3 రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామని, వివరాలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులను సంప్రదించాల్సిందిగా వారు సూచించారు.